క్లుప్తంగా

నేడు పోలేపల్లిలో పిన్నెల్లి ఎన్నికల ప్రచారం

దుర్గి : వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్‌లు పోటీ చేయనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పోలేపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు ప్రభుత్వ విప్ పిఆర్కే ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రతి ఒక్కరూ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు, యువతీ, యువకులు, మండల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మాచవరం: మండలంలోని వెల్లంపల్లి ముంపు ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. వివరాల ప్రకారం గత కొన్ని రోజులుగా పులిచింతల ముంపు ప్రాంతమైన వెల్లంపల్లి పొలాల నుంచి అక్రమంగా మట్టి త్రవ్వకాలు జరుపుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా మట్టిని తరలిస్తున్న జేసీబీని, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

భూసార పరీక్షలతో మేలు

రెంటచింతల : పంటలను సాగుచేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. దీంతో రైతులకు ఆ భూముల్లో సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉంటుందని చెప్పారు. సోమవారం ఆయన రెంటచింతల పంటపొలాల్లో రైతులనుద్దేశించి మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లైతే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడుకోవాలని, జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సూక్ష్మపోషకాల లోపాల వల్ల వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని ఎక్కువ శాతం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచినట్‌లైతే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో విఏఏలు, విహెచ్ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, గొట్టం లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, మేమంతా బస్సు యాత్ర విజయవంతం కావాలని పట్టణంలోని కనక దుర్గమ్మ దేవాలయంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ క్రోదూరి ప్రసాద్, కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు,గర్నె నాగేశ్వరరావు, తురకా ముక్కంటి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెం బంగారురెడ్డి, కొల్లా పుల్లయ్య, ఎం.బ్రహ్మం, ఆవులయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తమలపాకుల అలంకరణలో మహాసరస్వతి

పిడుగురాళ్ల : పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో వేంచేయున్న శ్రీ మహా సరస్వతి అమ్మవారికి సోమవారం దేవి వసంత నవరాత్రుల సందర్భంగా తమలపాకులతో విశేష అలంకరణ నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరైన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ పూజారి తీర్థప్రసాదాలను అందజేశారు.

17న సత్రశాలలో సీతారామ కళ్యాణం

సత్రశాల (రెంటచింతల) : మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని శ్రీ రామలక్ష్మణ విశ్వామిత్ర ఆలయంలో ఈ నెల 17న సీతారామ కళ్యాణం వేడుకలను నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్ధూరి బ్రహ్మానందరెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ సోమవారం తెలిపారు. స్వస్తిశ్రీ శ్రీ క్రోధి నామసంవత్సరం, నవమి తిథి పురస్కరించుకుని ఉదయం 10 గంటల శుభ ముహూర్తంలో ఈ కళ్యాణ మహోత్సవం జరిపిస్తున్నట్లు తెలిపారు. 1244 సం. కోటల వంశానికి చెందిన అంబదేవుడు అనే రాజు నిర్మితమైన అతిపురాతనమైన శైవక్షేత్రంగా విరాజిల్లు తున్న ఈ దేవస్థానంలో తొలిసారిగా సీతారాములవారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళ్యాణ వేడుకల్లో పీటలపై కూర్చునే దంపతులు వారి వివరాలను ముందుగా తెలియచేయాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సీతారాములవారి కరుణ కటాక్షాలు పొందాలని, తీర్ధ ప్రసాదాలను స్వీకరించాలని ఆకాంక్షించారు. పీటలపై కూర్చునే వారు 98662 03566 నంబరును సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వేసవిలో నీటిని వృధా చేయకండి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల : వేసవిలో నీటిని వృధా చేయవద్దని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శివారు కాలనీల్లో కృష్ణా జలాలు ట్యాపుల ద్వారా అందించటం జరుగుతుందని, కొన్ని ప్రాంతాల్లో ట్యాపులు ఆపక పోవడంతో నీరు వృధా అవుతోందని, అవసరమైనంత వరకు వాడుకుని కొళాయిలను ఆపివేయాలన్నారు. పట్టణంలో సగానికి పైగా కొళాయిల ద్వారా నీటి అందిస్తున్నామని, కొళాయిలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో పైపులైన్ పనులు జరుగుతున్నందున ఈ ప్రాంతాల్లో నీటిని సమస్య లేకుండా వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయబోతున్నామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తమ వార్డులో శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని, తక్షణమే సిబ్బందిని పంపించి శానిటేషన్ చేయించాలని మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. 8వ వార్డు కౌన్సిలర్ అప్పిరెడ్డి మాట్లాడుతూ వార్డు శివారు ప్రాంతాల్లో నీటి సమస్య ఉందని, సమస్య పరిష్కరించేందుకు నూతనంగా బోరును ఏర్పాటు చేయాలని, అప్పటి వరకు వాటర్‌ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సభ దృష్టికి తీసుకు వచ్చారు. 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఎండలు విపరీతంగా ఉండడం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఎండిపోయిన బోర్లకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, ఆ ప్రాంతాల్లో నీటి ట్యాంకుల ద్వారా, చేతి బోర్ల మరమ్మతులు చేపట్టాలని, వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సభ దృష్టికి తీసుకు వచ్చారు. 28వ వార్డు కౌన్సిలర్ అన్నెం పద్మావతి మాట్లాడుతూ వార్డులో బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకు రాగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ , వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్ గిరికుమార్, షేక్ జైలాబ్దీన్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

19న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్

మాచర్ల : పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేసిన అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈనెల 19 న శుక్రవారం ఉదయం 11.05 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సోమవారం తెలిపారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం వేలాది మంది అభిమానులతో ర్యాలీ నిర్వహించి రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ ముందు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఐదు మండలాలకు చెందిన అభిమానులు పాల్గొననున్నట్లు పీవీఆర్ తెలిపారు. ప్రతి కార్యకర్తల, అభిమానులు, ప్రజలు అన్ని వర్గాల వారు స్వచ్చందంగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రాజకీయ నేపథ్యం : ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయ నేపథ్యాన్ని 2008లో వెల్దుర్తి జెడ్పీటీసీగా నామినేషన్ వేసి ఆ ఎన్నికల్లో ఆయనకు ఎవరూ వ్యతిరేకంగా పోటీ చేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబంతో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో వారికి వీరాభిమానిగా మారిన పీఆర్కేకు 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా నియోజకవర్గంలో తిరుగులేని ఎమ్మెల్యే విజయం సాధించారు. అనంతరం సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో అనర్హత వేటుకు గురై 2012 ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తిరిగి 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2019లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున అభ్యర్థిగా పోటీ చేసి 23వేల మెజారీతో విజయం సాధించారు. ప్రభుత్వ విప్‌గా, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పనిచేస్తూ పల్నాడు జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి నాలుగో సారి మాచర్ల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున పీఆర్కేను అభ్యర్థిగా నిర్ణయించడంతో ఈనెల 19న ఆయన నామినేషన్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇంత వరకు రాజకీయాల్లో అడుగు పెట్టి పోటీ చేసిన ఏ ఎన్నికల్లోనైనా ఓటమి ఎరుగని ప్రజల అభిమాన నేతగా, మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



చర్లగుడిపాడు గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన కార్యకర్తలు



జంగమహేశ్వరపురంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన కార్యకర్తలు

గురజాల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు మెచ్చి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు మెచ్చి తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు జరిగాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వేముల చలమయ్య, కావూరి అంజిబాబుల ఆధ్వర్యంలో 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వరికల్లు సైదయ్య, ఉద్దగిరి సాంబయ్య, శ్రీను, వరికల్లు రాములు, వరికల్లు నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీను, ఉద్దగిరి పుల్లారావులతో పాటు మరికొంత మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కే వీ), గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ కొమ్మినేని రవిశంకర్, బత్తుల ప్రసాద్, బత్తుల తిమ్మరాజు, తండా మస్తాన్, వి వేణు, యలమందా, జి నరసింహరావు, వి వీరయ్య, గుమ్మా చంటి తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక

గురజాల : నగర పంచాయతిలోని జంగమహేశ్వర పురంకు చెందిన 150 కుటుంబాలు సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదర స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాసు కోరారు. పార్టీలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, వడ్డెర కుటుంబాలకు చెందిన వారు పార్టీలోకి చేరారు.

బీసీల ఓట్లు అడిగే హక్కు కూటమికి లేదు

బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆది శేషు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంగిరేకుల ఆదిశేషు

గురజాల : రాష్ట్రంలో బీసీలను ఓట్లు వేయమని అడిగే హక్కు కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు లేదని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీ కులాలను విస్మరించిందన్నారు. షాదీఖానాలో పల్నాడు జిల్లా అఖిల భారతీయ యాదవ్ జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ ఆధ్వర్యంలో బీసీల ఆత్మీ య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ నీతి, నిజాయితీకి మారు పేరు బీసీ కులస్తులన్నారు. బీసీ వర్గాలకు న్యాయం జరగాలన్నా, ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలన్నా తప్పనిసరిగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. వైఎస్సార్ సీపీలో కుటుంబ సభ్యులకు పదవులు పొంది బీసీలకు న్యాయం చేయడం లేదని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడటం సరికాదన్నారు. పార్టీ పదవులు అన్ని పొంది ఇప్పుడు జగన్ బీసీలను పట్టించుకోరని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజు యువ సేన రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి నాని, నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంటూరి బాబ్జి నందా, శాలివాహన సంఘం అధ్యక్షుడు లలిత్‌కుమార్, వడియరాజుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి ప్రసాద్, డి ఏడుకొండలు, చల్లా రవి కుమార్, ఎం నాగరాజు, పార్లమెంట్ మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, మువ్వా మల్లికార్జునరావు, బత్తుల తిమ్మరాజు, బత్తుల ప్రసాద్, మంచి అంజి, బండి రవికుమార్, నీలంరాజు, బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డెరలకు పదవుల్లో ప్రాధాన్యత ఇస్తాం

వడ్డెర సంఘ ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పక్కన పీవీఆర్

మాచర్ల : రానున్న రోజుల్లో నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న వడ్డెరలకు ప్రతి పదవిలో ప్రాధాన్యత కల్పిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వడ్డెరలకు ప్రాధ్యానత కల్పించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి, దుర్గితో పాటు పలు మండలాల్లో వడ్డెరలకు ప్రాధాన్యత కలిపిస్తామని చెప్పారు. విజయపురిసౌత్ సమీపంలోని దేశాలమ్మ గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వడ్డెరల ఆత్మీయ సదస్సుకు మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో నలుగురు సర్పంచ్‌లతో పాటు, పలువురికి పదవులు ఇచ్చామని, పట్టణంలో నాలుగు కౌన్సిలర్ పదవులు కేటాయించడం జరిగిందన్నారు. పట్టణంలో వడ్డెర కమ్యూనిటీ హాలు పూర్తి చేస్తామని, ప్రతి మండలంలో వడ్డెరలకు శుభ కార్యాలు చేసుకునేందుకు ప్రత్యేక భవనాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు తురకా కిషోర్, చల్లా కాశయ్య, అడిగొప్పల ఎంపీటీసీ చల్లా శ్రీను, గ్రామాల సర్పంచ్‌లు డి.యాగయ్య, లాజర్‌లు, ఎంపీటీసీలు, నియోజకవర్గ వడ్డెర సంఘ నాయకులు సుమారు వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. అనంతరం తురకా కిషోర్ ఆధ్వర్యంలో విందు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సమావేశానికి భారీ స్థాయిలో ప్రజలు తరలి వచ్చారు. అనంతరం పీఆర్కే, పీవీఆర్‌లు, వడ్డెర సంఘ నాయకులు సత్కరించారు.

ఆదిరెడ్డి సేవలు మరువలేం

మాచర్ల రూరల్ : గ్రామాభివృద్ధిలో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ అరికట్ల ఆదిరెడ్డి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేమని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ అరికట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అరికట్ల ఆదిరెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశోదమ్మ, ఎంపీటీసీ నక్కా సాంబశివరావు, నక్కా కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కావూరి రామస్వామి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, కొరటా నరసింహారావు, నాసరయ్య న్నారు.

జనసేన మండల అధ్యక్ష పదవికి దుర్గారావు రాజీనామా



దాచేపల్లి : జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్ష పదవికి మందపాటి దుర్గారావు సోమవారం రాజీనామా చేశారు. జనసేన ఆవిర్భావం నుంచి ఆపార్టీ క్రియాశీల నేతగా, మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన దుర్గారావు వ్యక్తిగత కారణాలతో అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. దుర్గారావు రాజీనామా చేయడంతో ఆపార్టీకి భారీ షాక్ తగిలినట్లయింది.

పిన్నెల్లిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మైనార్టీలదే



వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ నేతలు

మాచర్ల : మాచర్ల నియోజకవర్గంలో మైనార్టీల కోసం పలు అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మైనార్టీ నేతలు అన్నారు. సోమవారం వారు 28వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని, మైనార్టీ నాయకులు అస్సాం టీ పాడి మస్తాన్, షేక్ నలీంబాషా, బ్యూటీషియన్ స్టేట్ డైరెక్టర్ ఉప్పలపాటి జానీ, కో ఆప్షన్ మెంబర్ షేక్ యాసిన్‌తోపాటు, పలువురు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకు ఎవరూ ఓటు వేయకూడదని, వారంతా మూకుమ్మడిగా మైనారిటీ కుటుంబాలకు వివరించారు. రాజీపడి టీడీపీ కూటమిని గెలిపిస్తే మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.వాసు, ఆర్.చెన్నయ్య, పి.వెంకటరెడ్డి, మైనార్టీ నేతలు కిరణ్ టైలర్ మస్తాన్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పిన్నెల్లి సతీమణి రమాదేవి




కర పత్రం అందిస్తున్న పీఆర్కే చెల్లి నాగమణి

మాచర్ల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి పిన్నెల్లి రమాదేవి సోమవారం 14వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేసి మరోసారి సీఎం వై.ఎస్.జగన్‌ను, పీఆర్కేలను గెలిపించాలని కోరారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ దేవాలయం, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి, గంగా పార్వతి నగరేశ్వరస్వామి దేవాలయాలతోపాటు, అమ్మవారి దేవాలయంలో పీఆర్కే తల్లి పిన్నెల్లి రాములమ్మ, సోదరి జువ్వాజి నాగమణిలతో కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కోలా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.బ్రహ్మారెడ్డి, మహిళ అధ్యక్షురాలు నామణి, స్టేట్ డైరెక్టర్ బూదాడ మరియమ్మ, కో ఆప్షన్ మెంబర్ ఉమ, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర కీలకం

రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి



ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న అధికారి

గురజాల : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో పీవో, ఏపీవోలు పాత్ర కీలకమని రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ , అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో ఎన్నికల విధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మాట్లాడుతూ ఎన్నికలు జరిగే ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజు, సిబ్బంది విధులపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ అందించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చట్ట పరమైన సాంకేతిక అంశాలు, ఎన్నికల విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలు, ఈవీఎం, వీవీ ప్యాట్ల పని తీరు సహా అనేక అంశాలపై సిబ్బందికి శిక్షణ అందించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో పీవో, ఏపీవోలు పాత్ర కీలకమన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం సిబ్బందికి ఉందన్నారు.

మద్యం అక్రమ రవాణపై నిఘా పెట్టాలి

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు



సమీక్ష నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

దాచేపల్లి : మద్యం అక్రమ రవాణపై నిఘా పెట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పొందుగల, తంగెడ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రాకపోకలు సాగించే వాహనాలను ఆపి తనిఖీలు చేయించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెబ్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణ జరగకుండా వాహనాల తనిఖీలు పటిష్టంగా చేయాలని ఆయన ఆదేశించారు. సెబ్ సీఐలు ఎస్. వెంకటరమణ, డి. సూర్యనారాయణ, కెపి. కిషోర్ తదితరులున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంటచింతల : ఎన్నికల కోడ్ కారణంగా మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారిపై మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె. పాపయ్య నేతృత్వంలోని బృందం సోమవారం వాహనాలను ఆపి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి పాపయ్య మాట్లాడుతూ మే 13 నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. అనుమానాస్పదంగా వెళుతున్న వాహనాలను, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖచ్చితంగా వీడియో తీయడం జరుగుతుందన్నారు.

అగ్ని ప్రమాదాలపై ముందస్తు చర్యలు పాటించాలి

పిడుగురాళ్ల : అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలను ప్రతి ఒక్కరు పాటించాలని పిడుగురాళ్ల స్టేషన్ అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కరపత్రాలను ప్రయాణికులకు పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మ్యాన్ పీవీ రమణరావు, డ్రైవర్, ఆపరేటర్ ఎస్. శ్రీనివాసరెడ్డి, ఫైర్‌మెన్ ఎస్‌కే బాద్‌షా, హోంగార్డులు బి. మరియదాసు, సీహెచ్ పిచ్చయ్య, బి. నరసింహారావు, జి. రామాంజనేయులు పాల్గొన్నారు.

87 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా




దుర్గి : ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించిన తమ సేవలను రాజకీయ కుట్రతో నిలిపి వేసినందుకు నిరసనగా వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తాకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ముటుకూరు 1 సచివాలయం నుంచి 24 మంది, ముటుకూరు 2 నుంచి 7, అడిగొప్పల 1 నుంచి 10, అడిగొప్పల 2 – 4, ఆత్మకూరు 4, దుర్గి 2 – 2, పోలేపల్లి 7, ఓబులేశునిపల్లె 29, మొత్తం 87 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి సైదారావు, చెన్నూరి సత్యం, కేశంశెట్టి మల్లికార్జున, మాదాసు రాఘవ, పీట్ల శ్రీను, ఆవుల లక్ష్మీనారాయణ, రామిశెట్టి లక్ష్మీనారాయణ, పసుపులేటి శివకృష్ణ, యర్రపాటి రమేష్, జనమల శ్రీకాంత్, మక్కెన భార్గవ్, మక్కెన పవన్, మాచర్ల యోగేశ్వరరావు, సురేష్, రాంబాబు, తోడేటి బ్రహ్మం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ పసుపులేటి సాయిశంకర్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

100 మంది వలంటీర్లు రాజీనామా

మాచర్ల రూరల్ : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 100 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామా అందజేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ సరోజనీదేవికి రాయవరం, చింతలతండా, కంభంపాడు, గన్నవరం, ఖైరవునిపాడు, తాళ్ళపల్లి తదితర గ్రామాలకు చెందిన 100 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులున్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా అండగా నిలవాలి

జై బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగాల సింగరయ్య యాదవ్



దాచేపల్లి : బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా అండగా నిలవాలని జై బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగాల సింగరయ్య యాదవ్ పిలుపునిచ్చారు. దాచేపల్లిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుని అణగదొక్కిందని, సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలను బ్యాక్‌బోన్‌గా భావించి రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 44శాతం స్థానాలను కేటాయించారని, గెలిచిన కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపాలిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల్లో అత్యధికంగా బీసీలే ఉన్నారని చెప్పారు. బీసీ వర్గాలను మోసం చేసిన చంద్రబాబు మాయకూటమిని నమ్మవద్దని, చంద్రబాబుకి మళ్లీ అధికారం వస్తే బీసీలను పాతాళానికి తొక్కుతారని చెప్పారు.